# నమస్తే తెలంగాణ

## భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, బుధవారం 30 ఏప్రిల్ 2025 | BHADRADRI KOTHAGUDEM


- నిరుపేదలకు మొండి'చేయి' చూపారు..
- గుడిసెలను కూల్చుకునోళ్లనూ వదిలి డబ్బునోళ్లకే మంజూరు
- ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పినవారికే అందలం
- ఎమ్మెల్యే జారే దత్తత గ్రామంలోనూ పేదలు దగా
- రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసిన పలు గ్రామాల ప్రజలు
- అర్హుల జాబితా తనిఖీకి వచ్చిన అధికారుల అడ్డగింత
- అనర్హులకు ఇళ్లు ఎలా ఇచ్చారంటూ మండిపాటు
- ఆది నుంచి అభాసుపాలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం



చంద్రుగొండ : మహ్మదనగర్ గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

# కాంగ్రెసోళ్లకే ఇళ్లు !

**ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆది నుంచీ అభాసుపాలవుతున్నది. ఎంతోకాలంగా ఊరిచ్చి ఊరిచ్చి సిద్ధం చేసిన అర్హుల జాబితాలో కాంగ్రెస్ స్వార్థం బయటపడింది. హస్తం పార్టీ వాళ్లకే ఇళ్లు మంజూరు చేసి తమకు మొండి'చేయి' చూపారంటూ నిరుపేదలు మండిపడ్డారు. స్థానిక నాయకులు, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన వారినే అందలమెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ అర్హుల జాబితాను పరిశీలించడానికి వచ్చిన అధికారులను పేదలు నిలదీశారు. ప్రభుత్వాన్ని నమ్మి ఉన్న గుడిసెలను సైతం కూల్చుకున్న వారికి ఇళ్లు ఇవ్వకుండా డబ్బునోళ్లకు ఎలా మంజూరు చేస్తారంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దత్తత గ్రామం చంద్రుగొండ మండలం మహ్మద్‌నగర్‌లో అధికార పార్టీ నాయకులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంతో మహిళలు, గ్రామస్తులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. ముదిగొండ మండలం వనంవారికిష్టాపురంలో పంచాయతీ కార్యదర్శి, గుమస్తాను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. మరోమారు సర్వే చేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, అప్పటివరకు ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. దీంతో తనిఖీ అధికారులు చేసేదేమీలేక తెల్లముఖం వేసుకొని వెనుదిరిగి వెళ్లిపోయారు. ఖమ్మంరూరల్ మండల పరిషత్ కార్యాలయానికి ఆరెకోడుతండాకు చెందిన గిరిజన మహిళలు వెళ్లి నిరుపేదలమైన తమకు ఇళ్లు మంజూరు చేసి.. న్యాయం చేయాలని అధికారులకు విన్నవించారు.**

అశ్వారావుపేట, ఏప్రిల్ 29 : నారాయణపురం గ్రామ పంచాయతీ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను తనిఖీ చేసేందుకు ప్రత్యేకాధికారైన మండల వ్యవసాయాధికారి శివరాం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లారు. జాబితాను పరిశీలిస్తుండగా పంచాయతీ పరిధిలోని నారాయణపురం, పెంచికలపాడు, నెమలిపేట, సూర్యంపేట, జగన్నాథపురం గ్రామాల నిరుపేదలు అక్కడకు చేరుకున్నారు. నిరుపేదలమైన తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకుండా ఆస్తులు ఉన్న పెద్దలకు కేటాయించారని మడకం లక్ష్మడు, ముద్దల నారాయణ, పవన్‌కుమార్, కుమారస్వామి, లక్ష్మణ్, బోయినపల్లి మధు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ గ్రామ కమిటీలు కూడా ఏకపక్షంగా వ్యవహరించారని, వలస రాజకీయ నేతల సూచన మేరకు లబ్ధిదారులను ఎంపిక చేశారని, మహిళా కమిటీ సభ్యుల భర్తల పెత్తనం ఏమిటని నిలదీశారు. పేదలు అధికంగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేసి అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారంటూ అధికారులు, ఇందిరమ్మ కమిటీ బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతనిస్తామని ప్రకటిస్తున్నా స్థానిక రాజకీయ నాయకులు తన అనుచరులకే ప్రాధాన్యతనిచ్చారని ధ్వజమెత్తారు. పేదలకు ఇళ్లు మంజూరు చేసేవరకు సర్వే చేయొద్దని తేల్చిచెప్పారు. దీంతో సర్వే అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.



అశ్వారావుపేట : సర్వే అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

### ఎమ్మెల్యే జారే దత్తత గ్రామంలో..

చంద్రుగొండ, ఏప్రిల్ 29 : అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దత్తత తీసుకున్న మహ్మద్‌నగర్ గ్రామంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని మంగళవారం తనిఖీకి వచ్చిన అధికారులపై మహిళలు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి, రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. ఇండ్లు లేని, గుడిసెలు ఉన్నవారికి, పేదలు, వితంతువులు, దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు రాలేదో అధికారులు జవాబు చెప్పాలన్నారు. కేవలం భూములు ఉన్నవారికి, ఇందిరమ్మ కమిటీ చెప్పిన వారికే ఇండ్లు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారి వినయ్, పంచాయతీ కార్యదర్శి శివపై గ్రామస్తులు, మహిళలు మండిపడ్డారు. దీంతో తూతూమంత్రంగా సర్వే చేసి, అక్కడ నుంచి అధికారులు వెళ్లిపోయారు.

### పంచాయతీ కార్యాలయానికి తాళం

ముదిగొండ, ఏప్రిల్ 29 : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారని మండల పరిధిలోని వనంవారి కిష్టాపురం గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి నిరుపేదలు తాళం వేశారు. ఇళ్లు మంజూరైన 26 మందిలో కనీసం దరఖాస్తు కూడా చేసుకోని వారి పేర్లు కూడా ఎందుకున్నాయని పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌ను నిలదీశారు. తమకు ఉండటానికి ఇళ్లు లేకపోయినా తమ పేరు ఎందుకు రాలేదని, పక్కా ఇళ్లు, పొలాలు, కార్లు ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆగ్రహించి పంచాయతీ కార్యదర్శి, గుమస్తాను పంచాయతీ కార్యాలయం లోపల ఉంచి బయట తాళం వేసి తమ నిరసన తెలిపారు. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని బయటకు తీసుకురాగా.. ఇది ఫైనల్ లిస్టు కాదనీ, ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిగణనలోకి తీసుకుని అనర్హులు ఉంటే తొలగిస్తామని చెప్పడంతో శాంతించారు. మండల పరిధిలోని పండ్రేగుపల్లి గ్రామస్తులు సైతం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

### అధికారులే మాకు న్యాయం చేయాలి



ఖమ్మం రూరల్, ఏప్రిల్ 29 : 'కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అయితేనే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కమిటీ బాధ్యులు పేర్లు ఉంచుతున్నారు.. వారికి గిట్టని వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఇక అధికారులే మాకు న్యాయం చేయాలి' అని కోరుతూ ఖమ్మంరూరల్ మండల పరిషత్ కార్యాలయానికి బాధితులు క్యూ కడుతున్నారు. మూడురోజులుగా కార్యాలయానికి వస్తూ అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. మంగళవారం ఆరెకోడుతండాకు చెందిన గిరిజన మహిళలు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఆవేదన వ్యక్తంచేశారు. పైరవీ ఉంటే తప్ప న్యాయం జరగడం లేదని, తండాకు వచ్చి మా పరిస్థితిని చూడాలని అధికారులను వేడుకున్నారు.

**– ఆరెకోడుతండా గిరిజన మహిళల వినతి**

### గాలొస్తే కొట్టుకుపోయే ఇల్లు మాది..



నేను, నా భర్త, నా కొడుకు ముగ్గురం రేకులషెడ్డులోనే ఉంటున్నాం. గాలిదుమారానికి రేకులు కొట్టుకుపోతున్నాయి. కొత్త ఇల్లు కట్టుకుందామంటే సరిపోయే అన్ని డబ్బులు లేవు. మాకు గుంట భూమి కూడా లేదు. కూలికిపోయి బతుకుతున్నాం. ఇల్లు మంజూరైందని అప్పట్లో చెప్పారు. దీంతో చాలా సంతోషపడ్డాం. అధికారులను ఇప్పుడు అడిగితే మీకు ఇప్పట్లో రాదు తర్వాత చూద్దాం అంటున్నారు. మా రేకుల షెడ్డును చూసి నాకు న్యాయం చేయాలి.

**– బానోతు బద్రి, ఆరెకోడుతండా, ఖమ్మంరూరల్ మండలం**

### కమిటీ వాళ్లే నా పేరు తీసేశారు..




తండాలో మాది చాలా బీద కుటుంబం. ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీ వాళ్లమే అయినా మా తండా నాయకుడు ఇళ్ల జాబితాలో నా పేరు లేకుండా చేశారు. ఇది చాలా అన్యాయం. దీని గురించి ఎంపీడీవో సారుకు చెప్పి.. న్యాయం అడుగుదామని వచ్చాను. కమిటీ వాళ్లకు నచ్చితే పేరు ఉంటదట.. లేకుంటే పేరు తీసేస్తరంట. ఇదెక్కడి న్యాయం. కలెక్టర్ సారు మా తండాకు వచ్చిన మా ఇళ్ల పరిస్థితిని చూసి న్యాయం చేయాలి.

**– భూక్యా లక్ష్మి, ఆరెకోడుతండా, ఖమ్మంరూరల్ మండలం**

# కొత్తగూడెంలో దస్తావేజు లేఖరుల నిరసన

### పాత విధానమే కొనసాగించాలని డిమాండ్

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 29 : భూ క్రయవిక్రయాల్లో కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చిన స్లాట్ విధానాన్ని రద్దు చేసి.. పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ విధానంలో స్లాట్ బుక్ చేసుకున్నప్పుడు ఏదైనా సమస్యతో ఆరోజు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే మరోసారి స్లాట్ బుకింగ్ చేసుకున్నప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. సర్వర్ డౌన్‌తో రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా తగ్గిపోతుందని, ప్రభుత్వం ఆదాయం కోల్పోవడంతో పాటు తాము కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.




కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

అలాగే జిల్లాలో రిజిస్ట్రేషన్ ఏరియాలుగా ఉన్న పాల్వంచ, పాత కొత్తగూడెం, సుజాతనగర్, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఇంటి అసెస్‌మెంట్ నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని, ఏజెన్సీ ఆధారిత పార్టీషన్ డీడీలను నమోదు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జావీద్, అన్వర్, శ్రీకాంత్, సుధాకర్, రాజు, దావూద్, అహ్మద్, చిన్ని, శ్రీను, జీవన్, సారథి తదితరులు పాల్గొన్నారు.















**వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభ ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అనర్గళ ప్రసంగం అమితంగా ఆకట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన తీరు కార్యకర్తలను ఆలోచింపజేసింది. భవిష్యత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుసల్పాలన్న కృతనిశ్చయాన్ని కలుగజేసింది. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాల్సిందేనంటూ కేసీఆర్ చేసిన దిశానిర్దేశం పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, ప్రజాప్రతినిధులపై తీవ్ర ప్రభావం చూపింది. పార్టీ కార్యకలాపాలపై మరింత దృష్టి సారించేలా ఎల్కతుర్తి సభ సమాయత్తం చేసింది. రాజకీయ ప్రత్యర్థులపై కేసీఆర్ పేల్చిన మాటల తూటాలు నయా జోష్‌ను నింపాయి. –ఖమ్మం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

# బీఆర్ఎస్‌లో జోష్






- ఎల్కతుర్తి సభకు కదంతొక్కిన గులాబీదండు
- ఆకట్టుకున్న అధినేత కేసీఆర్ ప్రసంగం
- భవిష్యత్ పోరాటాలకు కార్యకర్తల్లో స్ఫూర్తి
- పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా శ్రేణులు ఖుషీఖుషీ
- రజతోత్సవంలో తండోపతండాలుగా జిల్లా ప్రజలు
- సభ సక్సెస్‌పై కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం?

రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్.. దాదాపు నెలరోజుల ముందు నుంచే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. దీంతో తెలంగాణ ఉద్యమ అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇతర అన్ని వర్గాల ప్రజలు సభకు పెద్ద సంఖ్యలో తరలారు. సభ నిర్వహించిన ఎల్కతుర్తికి సుదూరంగా ఉన్న భద్రాచలం, అశ్వారావుపేట, సత్తుపల్లి, పినపాక, ఇల్లెందు, మధిర, కొత్తగూడెం, వైరా, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు అంచనాలకు మించి తరలివెళ్లడం.. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ చెక్కుచెదరలేదనేందుకు నిదర్శనమని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. బస్సులు సభకు వెళ్లకుండా అధికారుల ద్వారా ప్రభుత్వం ప్రయత్నించినా మొక్కవోని దీక్షతో పార్టీ శ్రేణులు ఎల్కతుర్తికి కదంతొక్కాయి. అధికారుల నిర్వాకంపై పార్టీ జిల్లా నేతలైన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి తదితరులు మండిపడ్డారు. అధికారులను నిలదీసి మరీ దగ్గరుండి బస్సులను పంపించారు.

### 'ఎల్కతుర్తికి ఎల్దమొస్తవా?' అంటూ..

గతంలో ఎన్నడూలేని విధంగా ప్రతి గ్రామం నుంచీ పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు కదిలారు. 'ఎల్కతుర్తికి ఎల్దమొస్తవా?' అనుకుంటూ పయనమయ్యారు. ముఖ్యంగా మహిళలు అమితాసక్తి చూపించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇక పోరుబాట పట్టాలని, ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడగాలని ఎల్కతుర్తి సభ స్ఫూర్తినిచ్చినట్లయింది. అయితే, ఈ రజతోత్సవ సభ సామాన్యుల్లోనూ కొత్త ఆశలను చిగురింపజేసింది. అధినేత కేసీఆర్ ప్రసంగం పార్టీ శ్రేణుల్లోనే గాక.. ప్రజల్లోనూ భరోసా నింపింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఏ విధంగా పురోగమించిందో.. ఉమ్మడి జిల్లా ఎంతలా అభివృద్ధి చెందిందో, సంక్షేమ పథకాలు ఎలా అందాయో అనే అంశాలను అన్ని వర్గాల ప్రజలూ బేరీజు వేసుకున్నారు. మరోసారి బీఆర్ఎస్‌కు అండగా ఉండేందుకు సంసిద్ధులవుతున్నారు. ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాట్లాడిన ప్రతీ మాట ఎన్నో ప్రశ్నలను తెరపైకి తెచ్చింది. సభ అనంతరం గ్రామకూడళ్లలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. పదేళ్లలో సాధించిన అభివృద్ధిని, ప్రస్తుత పరిస్థితులను సామాన్యులు సైతం బేరీజు వేసుకుంటున్నారు.

గత బీఆర్ఎస్ పాలనలో ప్రతి రైతు చేనులో ధాన్యపు సిరులు విలసిల్లాయని గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదంటూ చర్చించుకుంటున్నారు. రైతు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనుగోలు చేసే దిక్కు లేకపోవడంతో రైతులు గోడుమంటున్నారు. గత దశాబ్దంలో కేసీఆర్ అందించిన అండదండలను మననం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి యువకులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, మేధావులు సహా అన్ని వర్గాల ప్రజలు రజతోత్సవ సభకు తండోపతండాలుగా తరలివెళ్లారు. కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు, ఆయన పిలుపునందుకొని భవిష్యత్ కార్యాచరణకు దిగేందుకు సంసిద్ధులయ్యేలా సభకు ప్రత్యక్షంగా హాజరయ్యారు. స్వచ్ఛందంగా హాజరై అత్యంత కుతూహలంగా ప్రసంగాన్ని వినడం ద్వారా.. కాంగ్రెస్‌పై వ్యతిరేకత ఏ విధంగా ఉందో అర్థమవుతోందని బీఆర్ఎస్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అధికారం కోల్పోయి ఏడాదిన్నర గడుస్తున్నా పార్టీ కార్యకర్తల్లో ఉన్న అభిమానం చెక్కు చెదరకపోవడాన్ని ఈ సభ నిరూపించిందని భావిస్తున్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజలపక్షమేనని ఈ సభ చాటిచెబుతోందని అంటున్నారు.

### కాంగ్రెస్‌లో అంతర్మథనం?

ఎల్కతుర్తి సభకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లడంపై కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం మొదలైంది. ఏయే ప్రాంతాల నుంచి ఎంతమేరకు జనం తరలి వెళ్లారన్న అంశంపై వారు ఆరాతీసినట్లు తెలుస్తోంది. ఎన్ని ఆటంకాలు సృష్టించినా, నిర్బంధాలు పెట్టినా పార్టీ శ్రేణులు సభకు వెళ్లిన తీరును చూస్తుంటే.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు తిరుగులేదన్న భావన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది. పార్టీ బలోపేతంపై మరింత దృష్టిసారించేలా బీఆర్ఎస్ శ్రేణులను ఎల్కతుర్తి సభ కార్యోన్ముఖులను చేసింది. అయితే, వచ్చే ఏ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్ సత్తా చాటేందుకు కేసీఆర్ చేసిన దిశానిర్దేశం ఉపయోగపడనున్నట్లు పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.